క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీవారి శేషవాహన సేవ



శేష వాహనంపై దేవేరులతో కలియుగ నాథుడు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి హోమాలు, యాగశాల పూజలు, చూర్ణోత్సవం, ధ్వజావరోహణం, పూర్ణాహుతితో పాటు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం, చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. వైఖానస ఆగమ పండితుడు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీగిరి నిలయుని శేషవాహన సేవను శోభాయమానంగా నిర్వహించారు. శేషవాహనంపై శ్రీవారిని భక్తులు దర్శించుకుని పులకించారు. ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు అలేఖ్య ప్రభ సారథ్యంలో రింద శరణ్య కూచిపూడి నృత్య అకాడమీ హైదరాబాద్ కళాకారుల అద్భుత ప్రదర్శన భక్తులను అలరించింది. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాసచరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు కూచిపూడి నృత్య కళాకారులను ఘనంగా సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు శ్రీవారి కళ్యాణోత్సవం...

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీవారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారి తిరువీధి ఉత్సవం, వాసవీ కోలాట బృందంచే ప్రదర్శన ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.



నృత్యంతో అలరిస్తున్న రింద శరణ్య కూచిపూడి కళాకారులు

7 కిలోల గంజాయి పట్టివేత

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరు రోడ్డులో ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందిన నలుగురు వ్యక్తులు శనివారం గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. వారి వద్ద ఉన్న ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

పర్యావరణం అందరి బాధ్యత

ఒంగోలు సబర్బన్: పర్యావరణం ప్రతిఒక్కరి బాధ్యతని పలువురు నాయకులు అన్నారు. ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో మోదీ 11 సంవత్సరాల సుపరిపాలనకు సంబంధించి శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు సాదినేని యామినిశర్మ, తదితరులు పాల్గొని ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జి రవిశంకర్, జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొమ్మి నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వాడవాడలా ఈద్ ముబారక్

- నగరంలోని అన్ని మసీదుల్లోనూ బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు
- బక్రీద్ పండుగ త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలంటూ మతపెద్దల పిలుపు

ఒంగోలు టౌన్:

పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరంలోని ముస్లింలు శనివారం ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజులు, ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని 50 డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల కోసం ఈద్గా మైదానంలో వజూ ఖానాతో పాటు షామియానాలు ఏర్పాటు చేశారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా చిన్నారులు, వృద్ధులు ఈద్గా మైదానానికి వచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. దీంతో రాజాపానగల్‌రోడ్డు, గద్దలగుంట పరిసర ప్రాంతాలు ముస్లింలతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా హుసేన్ మౌలానా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హజరత్ ఇబ్రహీం త్యాగనిరతిని వివరించారు. ప్రతిఒక్కరూ ఇబ్రహీం త్యాగం నుంచి స్ఫూర్తి పొందాలని చెప్పారు. రుజుమార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. అనంతరం దువా జరిగింది. దేశంలోని ముస్లింలతో పాటు ప్రజలందరికీ సుఖశాంతులు ప్రసాదించాలని, సమాజంలో పెరిగినపోతున్న హింస నుంచి ప్రజలను కాపాడాలని, మతసామరస్యంతో ప్రజలంతా కలిసిమెలిసి జీవించేలా చూడాలని అల్లాహ్‌కు దువా చేశారు. ఖుద్బా తరువాత ఈద్ నమాజు ముగిసింది. నమాజుకు వచ్చిన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. దారివెంట కనిపించిన స్నేహితులు, పెద్దలకు కూడా ఈద్ ముబారక్ చెప్పారు. ఆహ్లాదకర వాతావరణంలో బక్రీదు పండుగ జరిగింది. ఈద్గా మైదానం వరకు రాలేని వారి కోసం నగరంలోని 21 మసీదులలో ఉదయం 6 గంటల నుంచి ఈద్ నమాజులు ఏర్పాటు చేశారు. దాంతో నగరం మొత్తం ఎటు చూసినా పండుగ వాతావరణం కనిపించింది.



ఒంగోలులోని ఈద్గా వద్ద బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో భారీగా పాల్గొన్న ముస్లింలు



మద్దిపాడులో...




ఈతముక్కల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. కొత్తపట్నంలోని మస్‌జీద్-ఎ-మహమదీయ, అల్లూరు గ్రామంలోని మస్‌జిద్-ఎ-అహమదీయ, రంగాయపాలెంలోని మస్‌జిద్-ఏ-నూర్, ఈతముక్కల గ్రామంలోని మదీన మస్‌జీద్, మడనూరులోని మదీన మస్‌జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద మతపెద్దలచే నమాజ్ చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దలు, పిల్లలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు బక్రీద్ సందర్భంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సోదరభావాన్ని అందరూ అనుసరించాలని మౌలానాలు పిలుపునిచ్చారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోసం ప్రతి మానవుడు నిస్వార్థంగా జీవించాలన్నారు. మనకు ఉన్న దానిలో ఎంతో కొంత ఇతరులకు పంచడం చేయాలన్నారు. అప్పుడే అల్లా కరుణిస్తాడని తెలిపారు. ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థన ముగించిన వెంటనే ఇళ్లకు చేరుకుని స్నేహితులు, బంధువులతో కలిసి విందు స్వీకరించారు.



బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లింలు



భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్న యువకుడు

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



శ్రీ సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి



శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పలు కాలేజీల విద్యార్థులు సత్తా చాటారు. ఒంగోలులోని శ్రీ సరస్వతి కాలేజీలో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్.సహస్ర శంకర్ (467/470), బైపీసీలో పి.ఖాదర్‌బీ (436/440), సీఈసీలో ఎ.శ్రావ్యకృష్ణ (489/500) మార్కులు సాధించినట్లు చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఎంపీసీలో 466 మార్కులు వచ్చినవారు 27 మంది, బైపీసీలో 435 మార్కులు వచ్చినవారు ఐదుగురు తమ విద్యార్థులున్నారని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తమ డైరెక్టర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టరు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈఓ ఎస్.వి.సురేష్, డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు...

శ్రీ ప్రతిభ విద్యాసంస్థల్లోని జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి తన్నీరు మణికంఠ 467 మార్కులు, యక్కంటి హేమవర్షిణి 467 మార్కులు, బైపీసీలో పిన్నక సంతోషిణి 435 మార్కులు, యేనుగంటి నాగనందిని 435 మార్కులు, దాసరి వైశాలి 434 మార్కులు, దేవాండ్ల పూజిత 434 మార్కులు సాధించినట్లు చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి రామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు. 464 మార్కులకుపైగా సాధించినవారు 42 మంది, 463 మార్కులకుపైగా సాధించినవారు 53 మంది, 462 మార్కులకుపైగా సాధించిన వారు 60 మంది ఉన్నారని చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ఇంటర్ ఫలితాల్లో చీమకుర్తి విద్యార్థుల ప్రతిభ

చీమకుర్తి: ఇంటర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో చీమకుర్తికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మొత్తం 470 మార్కులకుగానూ చీమకుర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీకి చెందిన గుజ్జుల శేఖర రెడ్డికి 467 మార్కులు, జాష్టి లోహిత 466 మార్కులు సాధించారు. తాటికొండ చందన, చిన్నం గోవర్ధని, జీ ప్రేమిక 464 మార్కులు పొందారు. విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి, డైరెక్టర్లు నాగార్జున రెడ్డి, గోపీకృష్ణారెడ్డి, వెంకారెడ్డి, అధ్యాపకులు అభినందించారు. చీమకుర్తికే చెందిన చైతన్య భారతి జూనియర్ కాలేజీ విద్యార్థులు భూమ్‌పల్లి నాగఅశ్విత, కే అలేఖ్య 462 మార్కులు సాధించగా, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

కార్మికుల హక్కులు హరిస్తున్న కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

చీమకుర్తి రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులు హరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రామతీర్థంలో ఏర్పాటు చేసిన గ్రానైట్ కార్మికుల గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికుల నడ్డివిరుస్తూ వారి హక్కులను హరిస్తూ కుట్రపూరితంగా పని గంటలు పెంచుతూ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారుల కోసం కార్మిక చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సీఐఐ సదస్సులో మహిళలు రాత్రివేళలో కూడా పనిచేయవచ్చని తీర్మానించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. శ్రామిక మహిళలకు పనిప్రదేశాలలో సరైన రక్షణ, రక్షణ కమిటీలు ఏర్పాటు చేసే తీర్మానం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇప్పుడు మహిళలు రాత్రివేళల్లో పనిచేయాలని తీర్మానించడం సిగ్గుచేటన్నారు. పనిగంటల పెంపు, మహిళలకు నైట్‌డ్యూటీల తీర్మానాలు, కార్మికుల చట్టసవరణ నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేసి కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.ఆంజనేయులు, గ్రానైట్ యూనియన్ నాయకులు పి.అప్పలరాజు, కనకరాజు, పుల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: డీలర్లు ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో విజయవాడ రీజియన్ పరిధిలో ప్రకాశం జిల్లాకు చెందిన పారదీప్ ఫాస్ ఫెట్స్ లిమిటెడ్ కంపెనీ తరఫున రిటైల్ వ్యాపారులకు శనివారం మెషీన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేకుంటే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కంపెనీ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.వి.సుభాష్, ఒంగోలు ఏడీ రమేష్, శ్రీనివాస్‌నాయక్, విజన్‌టెక్ కో ఆర్డినేటర్ దనయ్య, డీలర్ల అసోసియేషన్ సంఘం ప్రెసిడెంట్, హోల్‌సేల్ డీలర్ దేసు వీరయ్య, మార్కెటింగ్ మేనేజర్ పి.ప్రభాకర్, కంపెనీకి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం హైస్కూల్ నూతన హెచ్‌ఎంగా శ్రీనివాసరావు



నూతన హెచ్‌ఎం శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి

కొత్తపట్నం: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. శనివారం కొత్తపట్నం హైస్కూల్లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేసిన మన్నం శ్రీదేవి పదోన్నతిపై బేస్తవారిపేట బాలుర ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా నియమితులయ్యారు. కొత్తపట్నం హెచ్‌ఎం శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.శ్రీదేవి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ పీడీ సాయికిషోర్, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయిని ధనలక్ష్మి, పీడీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



కొత్తపట్నం బీచ్‌లో యోగా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

కొత్తపట్నం: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 6 గంటలకు కొత్తపట్నం బీచ్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. తీరంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఎక్కువ మంది మహిళలు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కోరారు. యోగా చేయడానికి మ్యాట్లు, తాగునీరు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పిన్నింటి మధుసూదన్‌రావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణుగోపాల్‌మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

మద్దిపాడులో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీంతో ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు: స్థానిక పైపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న మిండా తిరుపతి అనే వ్యక్తి ఇంట్లో జరిగిన దొంగతనానికి సంబంధించి మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిరావు శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు నిద్రించాడు. తెల్లవారుజామున నిద్ర లేచి చూడగా, ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా, బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలోని నగలు కనిపించకపోవడంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తిరుపతిరావు ఫిర్యాదు చేశారు. బంగారు నల్లపూసల దండ, చెయిను, ఉంగరం అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ శివరామయ్య క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. ఇంటి పక్కనే ఉన్న చెట్టు వద్ద రెండు సార్లు తిరిగిన డాగ్.. అక్కడే ఆగిపోయింది. కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇతర రాష్ట్రాల వ్యక్తుల వివరాలు అందజేయాలి

చీమకుర్తి రూరల్: మండలంలోని గ్రానైట్ పరిశ్రమలు, గనులు, పాల డెయిరీలు, కటింగ్ షాపులు, తదితర కంపెనీలలో పనిచేస్తున్న ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల వివరాలు పోలీస్‌స్టేషన్‌లో రెండు రోజుల్లో అందజేయాలని చీమకుర్తి సీఐ సుబ్బారావు శనివారం సూచించారు. వారి ఆధార్ కార్డులు, వ్యక్తిగత సమాచారాన్ని గ్రానైట్ పరిశ్రమల యజమానులు, గనుల యజమానులు సేకరించి ఒక రిజిష్టర్లో నమోదు చేస్తూ ఉండాలన్నారు. ఆ వివరాలను పోలీస్ స్టేషన్లో కూడా అందించాలని తెలిపారు. వారికి ఇల్లు అద్దెకు ఇచ్చే యజమానులు కూడా వారి వివరాలు సేకరించి పోలీస్ స్టేషన్లో తప్పనిసరిగా ఇవ్వాలని సీఐ సూచించారు.